రెండో పంట వేయొద్దు: మంత్రి అచ్చెన్న

కోటబొమ్మాళి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వంశధార కాలువ పరిధిలో సాగు చేసే రైతులు రెండో పంట వేయొద్దని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 'వంశధార గొట్టాబ్యారేజ్‌లో 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఈ నీటి నిల్వలు చాలా తక్కువ. నీటి ఎద్దడి విషయాన్ని రైతులు గుర్తించి.. వంశధార కాలువల పరిధిలో రెండో పంట సాగు చేయవద్ద'ని ఆయన కోరారు.

ఉపాధి లేదు.. కాలుష్యమే!


వ్యర్థాలతో కలుషితమైన కందివలస గెడ్డ



- పరిశ్రమల వ్యర్థాలతో రోగాలు
- పైడిభీమవరం చుట్టూ ప్రబలుతున్న వ్యాధులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ప్రభుత్వమే దృష్టి సారించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యేల వేడుకోలు



● పైడిభీమవరం పంచాయతీ గొల్లలపేటకు చెందిన ఈ బాలుడు పేరు నక్కాన మనోజ్. నరాల బలహీనతతో ఇలా మంచానికే పరిమితమయ్యాడు. వైద్యపరీక్షలు చేయిస్తే వాయు కాలుష్యంతోనే రుగ్మతకు గురైనట్టు వైద్యులు తెలిపారు. పాఠశాలకు వెళ్లాల్సిన పిల్లాడు ఇలా మంచానికి పరిమితమవడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. పెద్దాస్పత్రిలో చేర్పించే స్థోమత లేక.. మదనపడుతున్నారు.



● పైడిభీమవరానికి చెందిన ఇనుకోటి గోవిందరావు ఇలా పక్షవాతంతో ఇంటికే పరిమితమయ్యాడు. ఈయన వయసు 45 ఏళ్లు. భార్య, పిల్లలు ఉన్నారు. కొన్నేళ్ల కిందట ఈయన అనారోగ్యం బారిన పడ్డాడు. పక్షవాతంతో చేయి చచ్చుబడిపోగా పనికి వెళ్లలేని దుస్థితి. దీంతో ఆ కుటుంబం ఉపాధి లేక ఇబ్బంది పడుతోంది. వాయు, నీటి కాలుష్యం మూలంగానే ఆయన అనారోగ్యానికి గురైనట్టు వైద్యులు చెబుతున్నారు.

● ఎచ్చెర్ల మండలం షేర్‌మహ్మద్‌పురం పంచాయతీ లింగాలపేటకు చెందిన లింగాల మోహన్ అనే యువకుడు బీఎస్సీ చదివాడు. స్థానికంగా ఉపాధి లేక విశాఖలోని ఓ ప్రైవేటు రసాయన పరిశ్రమలో పనిచేస్తున్నాడు. పైడిభీమవరం పారిశ్రామికవాడలో ఉద్యోగానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో స్వగ్రామంలో తల్లిదండ్రులను ఉంచి విశాఖ నుంచి వారం వారం రాకపోకలు సాగిస్తున్నాడు.

● ఎచ్చెర్లకు చెందిన శ్రీనివాసరావు అనే యువకుడికి స్థానికంగా ఉపాధి దొరక్క విశాఖలో ఓ రసాయన పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అన్ని అర్హతలు ఉన్నా ఇక్కడ పరిశ్రమలు పరిగణలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.





● కందివలస గెడ్డ దారుణంగా తయారైంది. ఈ గెడ్డను ఒక పరిశ్రమ యాజమాన్యం ఆక్రమించి అడ్డగోలుగా రహదారి నిర్మించింది. రసాయనిక పరిశ్రమల నుంచి వెలువడిన వ్యర్థాలను గెడ్డలోకి విడిచిపెడుతున్నారు. పైడిభీమవరం పరిశ్రమ వ్యర్థాలు కలుస్తున్నాయి. దీంతో నదీ పరీవాహక గ్రామాల్లో తాగునీరు కలుషితమవుతోంది. పశువులు కూడా మృత్యువాత పడుతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరముంది.

-ఇటీవల అసెంబ్లీలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి చేసిన విన్నపం ఇది.



● జిల్లాలో ఎచ్చెర్ల నియోజకవర్గానికి దుర్భర పరిస్థితి. ఇది పూర్తిగా మెట్ట ప్రాంతం. వరి వంటి సంప్రదాయ పంటలు పండవు. అందుకే ఇక్కడి ప్రజలు సుదూర ప్రాంతాలకు ఉపాధికి వెళ్తుంటారు. చెంతనే పైడిభీమవరం పారిశ్రామిక వాడతో పాటు నియోజకవర్గంలో అనేక పరిశ్రమలు ఉన్నాయి. కానీ స్థానికులకు ఇక్కడ పరిశ్రమల యాజమాన్యాలు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. ఇంటికి ఒకరు చొప్పున గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినా.. స్థానిక పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు లేకపోవడం విచారకరం. ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలి.

-ఇటీవల అసెంబ్లీలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు చేసిన విన్నపం ఇది.

రణస్థలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి)

రణస్థలం మండలం పైడిభీమవరం ప్రాంతంలో ఓ పాతికేళ్ల కిందట పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని తెలిసి స్థానికులు సంబరపడిపోయారు. తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని భావించారు. తీరా ఉపాధి లేకపోగా.. ఇప్పుడు అవే పరిశ్రమలు కాలుష్యంతో తమ ఆయుష్షును తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమల్లో కనీస నాణ్యతా ప్రమాణాలు, భద్రతా చర్య లు పాటించడంలేదు. ఉపాధి, ఉద్యోగాల్లో స్థానికుల కు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో తమ త్యాగాలకు విలువ లేకుండా పోయిందని వారు వాపోతున్నారు.

● పైడిభీమవరం పంచాయతీలోని దేవునిపాల వలస, ముక్రుపాలవలస గ్రామస్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. పరిశ్రమల వ్యర్థాల కారణంగా బోర్లు, బావుల్లో నీరు పూర్తిగా కలుషితమైంది. దీంతో పక్కనే ఉన్న కందివలస గెడ్డలో చెలమలు తవ్వి నీటిని తోడుతున్నారు. ఈ రెండు గ్రామా ల్లో కలుషిత నీటి బారిన పడి చాలామంది కిడ్నీ, ఊపిరితిత్తులు, ఆస్మా, చర్మసంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ఒక్కోసారి డయేరియా, జ్వరాలు వ్యాపిస్తున్నాయి. ఆ సమయంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి తర్వాత అధికారులు మిన్నకుండి పోతున్నారు. ఏటా దీర్ఘకాలిక వ్యాధుగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. దాదాపు 50 వరకూ పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ రెండు గ్రామాల చెంతనే 25 ఎకరాల విస్తీర్ణంలో భారీ పరిశ్రమ ఉంది. ఈ పరిశ్రమలోని రసాయనిక వ్యర్థాలు.. కందివలస గెడ్డలో కలుస్తున్నాయి. వాస్తవానికి రసాయన వ్యర్థాలను ప్లాంట్‌లోనే నిర్వీర్యం చేస్తున్నట్టు యాజమాన్యం చెబుతోంది. కానీ పరిశ్రమ నుంచి నేరుగా పైపులైన్లను గెడ్డలో విడిచిపెడుతున్నట్టు తెలుస్తోంది. నెల్లిమర్ల నియోజకవర్గం పూసపాటిరేగ మండలంలోని గ్రామాల్లో ఇదే పరిస్థితి.

● ఈ గ్రామాల్లో అధికం..

రాష్ట్ర పారిశ్రామిక మౌలిక (మిగతా 6వ పేజీలో..)

సివిల్ కేసులు రాజీ చేయండి

- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 14న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ సివిల్ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం జిల్లా న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. సివిల్ కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలని తెలిపారు. అలాగే జిల్లాకేంద్ర కర్మాగారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు శుక్రవారం సందర్శించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. జైలు న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్ల సలహాలు, సూచనలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీ సభ్యురాలిగా గౌతు శిరీష



పలాస, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యురాలిగా ఎమ్మెల్యే గౌతు శిరీషను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన అసెంబ్లీ సమావేశంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు కమిటీ సభ్యులను ప్రకటించారు. గౌతు శిరీష మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని చిత్తశుద్ధితో నిర్వహిస్తానని, ప్రభుత్వానికి వనరులు సమకూర్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. సీఎం చంద్రబాబుకు, స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం గ్రీవెన్స్‌పై నిర్లక్ష్యం వహిస్తే ఎలా?

- కంచిలి తహసీల్దార్, వీఆర్వోకు నోటీసులు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

8లో



మత్తు వదిలిస్తున్నారు


ఇచ్ఛాపురంలో చెక్‌పోస్టు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి (ఫైల్)

- పూర్తిస్థాయి గంజాయి నియంత్రణకు ప్రణాళికలు
- మురాల కోసం పోలీసుల ప్రత్యేక బృందాలు
- 100 రోజుల్లో 40 కేసులు.. 106 మంది అరెస్ట్
- 1250 కేజీలకు పైగా నిల్వలు స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి రహిత జిల్లాయే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గంజాయిని రూపుమాపేందుకు కార్యరూపం దాల్చింది. ప్రతి జిల్లాలో గంజాయి నియంత్రణ బాధ్యతలను ఎస్పీలకు డీజీపీ తిరుమలరావు అప్పగించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి.. టార్గెట్ గంజాయి 100 రోజుల లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారు. ఈ ఏడాది ఆగస్టులో ఆయన ఎస్పీగా బాధ్యతలు చేపట్టగా.. జిల్లావ్యాప్తంగా పర్యటించి గంజాయి మూలాలు గల ప్రాంతాల జాబితాను సిద్ధం చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గంజాయి రవాణా, విక్రయాల అడ్డుకట్టపై ప్రత్యేక నిఘా పెట్టారు. వంద రోజుల్లోనే 40 కేసులు నమోదు చేసి.. 1,250 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 106 మందిని అరెస్టు చేశారు. గంజాయి నియంత్రణకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన జాగిలాలతో ఆర్టీసి కాంప్లెక్స్, పార్శిల్ సర్వీసులు, రైల్వే, బస్సు స్టేషన్లు, కంటైనర్లలో తనిఖీలు చేస్తున్నారు. డ్రోన్ల సహకారంతో కూడా శివారు, తీరప్రాంతాలను సైతం పరిశీలిస్తూ గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో జిల్లాలో సుమారు 56మంది గంజాయి బాబులు, రవాణాదారులు పరారయ్యారు. వీరిలో ముగ్గురు శ్రీకాకుళానికి చెందిన వారు. మిగిలిన వారంతా మహరాష్ట్ర, బెంగళూరు, ఒడిశాకు చెందిన వారు. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

● ఆరు ప్రత్యేక చెక్‌పోస్టుల ఏర్పాటు..

ఒడిశా సరిహద్దు నుంచి జిల్లా గంజాయి రవాణా జరుగుతున్నట్టు ఎస్పీ గుర్తించారు. ఈ మేరకు జిల్లాల్లో ఇచ్ఛాపురం, పాతపట్నం, పలాస, మందస, పైడిభీమవరంతోపాటు రాజాం ముందు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతి వ్యక్తినీ, వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టారు.


ఇటీవల పోలీసులకు పట్టుబడిన గంజాయి బస్తాలు

● అక్టోబరు 24న మెళియాపుట్టిలోని ఓ బొలేరో వాహనంలో 16 బస్తాల్లో 563 కేజీల గంజాయి పట్టుబడింది. రవాణాదారులు వాహనాన్ని విడిచి పరారయ్యారు. పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టగా.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు గంజాయి అక్రమ రవాణా చేయగా.. వారికి అక్కడి హోంగార్డు ఒకరు సహకరించినట్టు తేలింది. వారు ఒడిశా నుంచి వాహనంలో గంజాయిని తీసుకొచ్చి.. పలాసలో కంటైనర్‌లో లోడ్ చేసి బెంగళూర్‌కు తరలిస్తున్నట్టు తెలిసింది. ఆ ముగ్గురిని ఈ నెల 12 పోలీసులు అరెస్టు చేశారు. ఆ గ్యాంగ్‌తో లింక్‌లు ఉన్నవారిని కూడా పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

● శ్రీకాకుళంలో డచ్ బిల్డింగ్ వద్ద ఇటీవల ఓ గంజాయి ట్రాన్స్‌పోర్టు రాకెట్ బృందాన్ని డీఎస్పీ సీహెచ్ వివేకానంద, శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు తన బృందంతో పట్టుకున్నారు. ఒడిశాలో గంజాయి డీలర్‌తోపాటు ఆరుగురు రవాణా, విక్రయదారులను అరెస్టు చేశారు.

● గత ఐదేళ్లూ యథేచ్ఛగా రవాణా...

జిల్లాలో ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస, శ్రీకాకుళం, పాతపట్నం ప్రాంతాల్లో గంజాయి అక్రమ (మిగతా 6వ పేజీలో...)

జిల్లాలో పట్టుబడిన గంజాయి వివరాలు..

సంవత్సరం	కేసులు	పట్టుబడిన సరుకు (కిలోల్లో)	అరెస్టుల సంఖ్య
2021	20	267.5	30
2022	10	583.67	26
2023	19	338.8	65
2024 (జూన్ వరకు)	14	365.37	43
2024 (ఆగస్టు-నవంబరు)	40	1250.8	106

ఈసారైనా.. చర్చిస్తారా?

- జడ్పీ సమావేశంలో కొన్ని శాఖలపైనే సమీక్ష
- మిగతా విభాగాల పనితీరుపై కానరాని దృష్టి
- సమస్యలతో ప్రజలకు తప్పని ఇబ్బందులు



జడ్పీ సమావేశ మందిరం

శ్రీకాకుళం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశాలో ప్రజా ప్రతినిధులు, అధికారులు కేవలం మూడు నుంచి ఆరు ప్రభుత్వ శాఖలతో సమీక్ష ముగించేస్తున్నారు. మిగిలిన ప్రభుత్వ శాఖల పనితీరు కానీ, వాటి ప్రగతి కానీ.. జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై కానీ చర్చించడం లేదు. శనివారం నిర్వహించనున్న జడ్పీ సమావేశంలోనైనా అన్ని ప్రభుత్వ శాఖలపై సమీక్ష నిర్వహించి.. సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలని జిల్లావాసులు కోరుతున్నారు.

● జిల్లాలో ఎచ్చెర్ల, ఆమదాలవలస, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో ఉచిత ఇసుక పేరుతో దందాలు నడుస్తున్నాయి. అనుమతిలేని ర్యాంపుల నుంచి ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. దీనిపై మైనింగ్, రెవెన్యూ అధికారులతో సమీక్షించి.. అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి.

● శ్రీకాకుళం కార్పొరేషన్‌లో 50 డివిజన్లను గత ప్రభుత్వం ఇష్టానుసారంగా విభజించింది. దీనిపై పునః పరిశీలించాలని ఎమ్మెల్యేతోపాటు నగర ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై కలెక్టర్ చొరవ చూపాలి.

● శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అధికమంది వైద్యులు, స్పెషలిస్టులు కొద్ది సమయం మాత్ర మే అందుబాటులో ఉంటున్నారు. ఎఫ్ఎల్ఆర్ఎస్‌లో హాజరు వేసి.. తర్వాత నగరంలోని ప్రైవేటు ఆస్పత్రులు, సొంతక్లినిక్‌లకు వెళ్లిపోతున్నారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యాధికారులు సైతం శ్రీకాకుళం నుంచి కొంతమంది రాకపోకలు చేస్తున్నారు. దీంతో అత్యవసర వేళల్లో రోగులకు వైద్యసేవలు అందడంలేదు. రోగులను రిఫర్ చేస్తున్నారు. దీనిపై సమగ్ర చర్చ చేపట్టాలి.

● జిల్లాలో ఇప్పటివరకూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

● జిల్లావ్యాప్తంగా సాగునీటి చెరువులు.. ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించు కోవడంలేదు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరగాలి.

● జిల్లాలో ఫుడ్‌స్టాల్స్ పెరిగాయి. ఇష్టానుసారంగా నూనె, ఆహారపదార్థాలు కల్తీ జరుగుతున్నా సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు. దీనిపై కలెక్టర్ హెచ్చరిస్తే ఫలితం ఉంటుంది. అలాగే తూనికలు కొలతలు, విజిలెన్స్ ఎక్సైజ్, రెవెన్యూ వంటి శాఖల పనితీరుపై ఈసారైనా చర్చించాలి.

● వంశధార ఫేజ్-2, హిరమండలం ఎత్తిపోతల పథకం పనుల నిర్వహణపై సమగ్ర చర్చ జరగాలి. ఎత్తిపోతల పథకం ద్వారా పూర్తిస్థాయిలో నీరు ఎప్పుడు అందిస్తారన్నదీ అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది.

● కొన్నిచోట్ల పెట్రోల్ బంకుల్లో నిబంధనలు కానరావట్లేదు. సరిహద్దు ప్రాంతాల్లోని బంకుల్లో కల్తీ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వీటిపైనా చర్చించాలి.

● రేషన్ సరుకులు వినియోగదారులకు సక్రమంగా అందడం లేదు. ఎండీయూ వాహన సిబ్బంది రశీదులు అందజేయడం లేదు. పారదర్శకంగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలి.

● ఎచ్చెర్ల, రణస్థలం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో గత ప్రభుత్వ హయాంలో కొండలు ఆక్రమణకు గురయ్యాయి. అక్రమార్కులపై చర్యలు లేవు. అక్రమ తవ్వకాలను నిరోధిస్తూ తీసుకున్న చర్యలను వివరించేలా చర్చ జరగాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

అరసవల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తోపాటు జిల్లాస్థాయి అధికారులు హాజరవుతారన్నారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతోపాటు ఉమ్మడి జిల్లాలోని జడ్పీటీసీలు పాల్గొనున్నారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.



దంతపురి.. ఏదీ నాటి సిరి?

- చారిత్రక ప్రదేశంపై శీతకన్ను
- పట్టించుకోని పర్యాటక, పురావస్తు శాఖలు
- వైభవం కోల్పోతున్న వైనం



దంతపురిలో శిథిలావస్థలో ఉన్న బుద్ధుని విగ్రహం

సరుబుజ్జిలి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రొట్టవలస సమీపంలోని ప్రముఖ బౌద్ధ క్షేత్రం దంతపురి వైభవం చరిత్ర పుటలకే పరిమితమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు దంతపురిలో నిర్వహించే బుద్ధ జయంతి వేడుకలకు ప్రముఖ బౌద్ధ క్షేత్రాల నుంచి సన్యాసులు వచ్చేవారు. రాను రానూ ప్రభుత్వాలతో పాటు పురావస్తు, పర్యాటక శాఖలు దీనిపై శ్రద్ధ చూపకపోవడంతో కళ కోల్పోతోంది. మరోవైపు రూ.వందల కోట్ల విలువ చేసే దంతపురి భూములు రికార్డులు మారి రియల్ ఎస్టేట్‌గా దర్శనమిస్తున్నాయి.

అప్పట్లో వేడుకలు..

దంతపురిలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రత్యేకంగా బుద్ధుని శిలా విగ్రహం ఏర్పాటు చేసింది. కొన్నాళ్ల పాటు ఏటా బుద్ధుని జయంతి రోజున జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించేవారు. దేశ విదేశాల నుంచి బౌద్ధ సన్యాసులు రావడంతో పాటు ప్రత్యేక ఎగ్జిబిషన్ నిర్వహించేవారు. వివిధ రకాల క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. దంతపురికి చెందిన 175 ఎకరాల భూముల రికార్డులను తారుమారు చేసి కొంతమంది రియల్టర్లు స్వాహా చేశారు. దీనిపై అప్పట్లో మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతితో పాటు మాజీ మంత్రి తమ్మినేని సీతారాం కూడా ధర్నాలు, ర్యాలీలు నిర్వహించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది.



పురావస్తు తవ్వకాల్లో బయటపడిన స్థూపాలు

శిథిలావస్థలో బుద్ధుని విగ్రహం..

ప్రపంచ దేశాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బౌద్ధ సన్యాసులు దర్శించుకునే బుద్ధుని విగ్రహం నేడు శిథిలావస్థకు చేరుకుంది. దీనితో పాటు తవ్వకాల్లో బయటపడిన నాలుగు స్థూపాలు కూడా పూర్తిగా మట్టిలో కూరుకుపోయాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దంతపురి రక్షణకు ఏర్పాటు చేసిన ఉద్యోగులు, టూరిస్ట్ గైడులు ప్రస్తుతం జాడ లేకుండా పోయారు.



దంతపురి తవ్వకాల్లో బయటపడిన విగ్రహాలు

కనుమరుగువుతున్న కోట..

క్రీస్తుపూర్వం 261లో అశోక చక్రవర్తి చేసిన కళింగ యుద్ధం తర్వాత దంతపురి క్షేత్రం ప్రాచుర్యంలోకి వచ్చినట్టు చరిత్ర చెబుతోంది. అప్పటి కళింగ రాజు ఖారవేలుని రాజధానిగా దంతపురికి విశిష్ట స్థానం ఉంది. ఇక్కడి కోటకు 37 ఎకరాల్లో నలుదిక్కులా ఎత్తయిన ప్రాకారాలతో కలిసి ద్వారాలు ఉండేవని చెబుతారు. ప్రస్తుతం దంతపురి నాలుగు వైపులా ఉన్న కోటగట్టును స్థానికులు ఇష్టారాజ్యంగా తవ్వేసి.. ఆ ప్రాంతాన్ని కూడా ఆక్రమించుకోవడంతో దంతపురి కోట ఆనవాలు కూడా కనిపించని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం, పర్యాటక, పురావస్తు శాఖలు స్పందించి.. దంతపురి చారిత్రక వైభవాన్ని కాపాడాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

భామగా.. సత్యభామగా

- కూచిపూడి.. భరతనాట్యంలో రామకౌండిన్య ప్రతిభ
- స్త్రీ పాత్రలతో ప్రత్యేక గుర్తింపు
- దేశ, విదేశాల్లో ప్రదర్శనలు





సత్యభామగా రామ కౌండిన్య

గార, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆ తల్లికి నాట్యం అంటే ప్రాణం. ఆమె స్వతహాగా నాట్య కళాకారిణి. కానీ కుటుంబ కట్టుబాట్ల కారణంగా నాట్యానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. కానీ కుమారుడి ద్వారా తన కలను నెరవేర్చుకోవాలని అనుకుంది. తన బిడ్డకు నాట్యంలో శిక్షణ ఇప్పించింది. ఇప్పుడు బిడ్డ అవార్డులూ... రివార్డులూ అందుకుంటుంటే చూసి చెప్పలేనంత సంతోషాన్ని పొందుతోంది. ఆ యువకుడి పేరు రామకౌండిన్య. తల్లి ధనలక్ష్మి, తండ్రి ఎస్.వి. ధన్వంతరి. గార మండలం శ్రీకూర్మానికి చెందిన రామకౌండిన్య కూచిపూడి, భరతనాట్యంలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నాడు. రఘుపాత్రుని శ్రీకాంత్ వద్ద నాట్యంలో శిక్షణ పొందిన రామకౌండిన్య దేశ విదేశాల్లో ఇప్పటి వరకూ దాదాపు 800 ప్రదర్శనలు ఇచ్చాడు.

స్త్రీ పాత్రలతో గుర్తింపు..

వివిధ నృత్య రూపకాలతో రామకౌండిన్య ప్రేక్షకులను మెప్పిస్తున్నాడు. సత్యభామగా, రుక్మిణిగా.. తన హావభావాలతో ప్రశంసలు అందుకుంటున్నాడు. ఈ రూపకాల్లో ఆయన స్త్రీ పాత్రల్లో నర్తించడం గమనార్హం. రామాయణం, శ్రీనివాస కల్యాణం, శివలీలలు, ఏకాంత సేవ, గిరిజా కల్యాణం, శక్తి స్వరూపిణి, కృష్ణ లీలల్లో స్త్రీపాత్రలో ఆయన ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాడు. చిన్నప్పటి నుంచీ కళా ప్రదర్శనలు ఇస్తూనే..మరోవైపు చదువులోనూ రాణించాడు. శ్రీకాకుళంలోని వైష్ణవీ ఇంజనీరింగ్ కళాశాలలో హెచ్.ఆర్. మార్కెటింగ్‌లో ఎంబీఏ పూర్తి చేశాడు. కూచిపూడి నృత్యంలో విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీని అందుకున్నాడు. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కూచిపూడి, భరతనాట్యంలలో డిప్లమోలు పూర్తి చేశాడు. ప్రస్తుతం నాట్యంలో పీహెచ్‌డీ చేస్తున్నాడు. హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం నుంచి కూచిపూడి నృత్యంలో బి-హై గ్రేడ్ ఆర్టిస్టుగా గుర్తింపు పొందాడు.

ఎన్నో పురస్కారాలు..

రామకౌండిన్య తన నాట్య ప్రతిభతో ఎన్నో బహుమతులు సొంతం చేసుకున్నాడు. 2015, 2016, 2017లో వరుసగా మూడేళ్ల పాటు జాతీయ యువజనోత్సవాలలో ఉత్తమ కళాకారుడిగా బహుమతులు అందుకున్నాడు. ఇప్పటి వరకూ 18 జాతీయ అవార్డులు, 6 బంగారు పతకాలను సొంతం చేసుకున్నాడు. వీటితో పాటు నృత్య కౌముది, నాట్య వతంస, నాట్య మయూరి, నృత్య మణి, నాట్యమయూఖం వంటి బిరుదులతో వివిధ సంస్థలు గౌరవించాయి. దేబ ప్రసాద్ యువ ప్రతిభా పురస్కారం, యువ కళారత్న వంటి పురస్కారాలూ అందుకున్నాడు. న్యూఢిల్లీలో జరిగిన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో ఎన్.టి.ఆర్. పురస్కారాన్ని అందుకున్నాడు. అమెరికాలోని ఎనిమిది వేర్వేరు రాష్ట్రాల్లో 16 ప్రదర్శనల్లో పాల్గొనడం మరచిపోలేని అనుభూతిగా రామకౌండిన్య చెబుతాడు.



ఎన్టీఆర్ పురస్కారాన్ని అందుకుంటూ...

గురువు స్ఫూర్తితో ముందుకు...

శ్రీకాకుళం ఖ్యాతిని వ్యాపింపజేసిన నా గురువు శ్రీకాంత్ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నా. దీనిని ముందు తరాలకు అందించాలనేది అభిలాష. శ్రీకూర్మంలో సర్వాత్మిక నర్తన కళాక్షేత్రం అనే సంస్థను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాట్యంలో శిక్షణ ఇస్తున్నాను.

-రామకౌండిన్య

పోర్టు భూ సమస్యలు పరిష్కరిస్తాం

- అర్హులైన వారికి పీడీఎఫ్‌లు అందిస్తాం
- ఆర్డీవో మడక కృష్ణమూర్తి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

టెక్కలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు 826.51 ఎకరాల్లో రూ.4,361.91 కోట్లతో నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2023 ఏప్రిల్ 19న శంకుస్థాపన చేశారు. పోర్టుకు సంబంధించి పూర్తిస్థాయిలో భూ సమస్యలు పరిష్కరించడం గానీ, పీడీఎఫ్‌లు అందజేయడం గానీ, నిర్వాసితులకు ఆర్‌అండ్ ఆర్ కాలనీ కేటాయింపులు గానీ చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అధికారులు పెండింగ్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం ప్రారంభించా రు. ఈ నేపథ్యంలో టెక్కలి ఆర్డీవో మడక కృష్ణమూర్తి దీనికి సంబంధించిన విశేషాలు 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఆ వివరాలు..

ప్రశ్న: పోర్టు భూముల వ్యవహారంలో రైతుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించగలిగారా?

జవాబు: పోర్టు ప్రాంతంలో మూలపేట, విష్ణుచక్రం గ్రామాల నుంచి 320 ఎకరాల జిరాయతీ భూమి అవసరమని గుర్తించాం. 20 మంది రైతులకు సంబంధించి సుమారు ఒక ఎకరా భూమికి గాను సమస్య పెండింగ్‌లో ఉంది. దీనిని పరిష్కరించేందుకు ఇప్పటికే అధికారుల బృందాన్ని నియమించాం. మిగిలిన రైతుల భూములకు పరిహారం పంపిణీ చేశాం.

ప్ర: 293 ఎకరాల ఉప్పు భూముల సమస్యకు పరిష్కారం లభించిందా?

జ: సంతబొమ్మాళి మండలంలో సుమారు 5,006 ఎకరాల్లో ఉప్పు భూములు ఉన్నట్లు గుర్తించాం. అందులో పోర్టుకు 293 ఎకరాలు అవసరం. ఈ సమస్య పరిష్కారానికి గాను సంబంధిత ఉన్నతాధికారులతో ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి ఏపీ మారిటైం బోర్డు తీసుకునేందుకు లేఖ ఇచ్చాం. ఆ ప్రాంతంలో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రతిపాదన ఉంది. ప్రభుత్వానికి ఉప్పు భూముల అవసరం ఏర్పడింది. వీటికి సంబంధించి ఒక రైతు కోర్టును ఆశ్రయించారు.

ప్ర: పోర్టు రైలు మార్గం భూసేకరణ నిలిచిపోవడానికి కారణం ఏమిటి?

జ: పోర్టు రైలుమార్గం కోసం ఆరు గ్రామాల పరిధిలో 142 మంది రైతులకు చెందిన 72 ఎకరాలు గుర్తించాం. ఈ ప్రాంతంలో బీపీసీఎల్ రిఫైనరీకి ప్రతిపాదన వచ్చింది. అందువల్ల రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్చాల్సి వచ్చింది.

ప్ర: నిర్వాసితుల స్థల సమస్య తేలిందా?

జ: ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి సంబంధించి నౌపడ జంక్షన్ సమీపంలో సుమారు 55.78 ఎకరాలు గుర్తించాం. అందులో 3.67 ఎకరాలు వివిధ కారణాల వల్ల పెండింగ్‌లో ఉంది. నిర్వాసితులకు సంబంధించి 598 వర కు లేఅవుట్స్ వేయాల్సి ఉంది. ఇప్పటికే 511 ప్లాట్స్‌కు అవసరమయ్యే భూమిని సిద్ధం చేశాం. మిగిలిన 3.67 ఎకరాల సమస్య పరిష్కారం కాగానే మొత్తం సిద్ధం చేసి లాటరీ ద్వారా నిర్వాసితులకు కేటాయిస్తాం.

ప్ర: రోడ్డు మార్గం ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలగాయా?

జ: పోర్టుకు సంబంధించి రోడ్డు మార్గానికి గాను 317 ఎకరాల అవసరాన్ని గుర్తించాం. అందులో 228 ఎకరాలు జిరాయితీ. ఇప్పటికే 225 ఎకరాల మేరకు ల్యాండ్ ఎక్విజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. 3.27 ఎకరాల భూ సమస్య పెండింగ్‌లో ఉంది. వాటి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు, గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా కనెక్టివిటీని బట్టి అండర్‌పాసేజ్‌లు, సాగునీటి కాలువలు, రహదారి సౌకర్యాలు కల్పిస్తాం.

ప్ర: పెండింగ్ పీడీఎఫ్‌ల పరిష్కారానికి ఏం చేయబోతున్నారు?

జ: పీడీఎఫ్ చెల్లింపులకు 2022 ఏప్రిల్ 8న కటాఫ్ డేట్‌గా నిర్ణయించారు. పోర్టు పరిధిలో 584 వరకు పీడీఎఫ్‌లు గుర్తించి పంపిణీ చేశారు. అదనంగా మరో 14 పీడీఎఫ్‌లతో పాటు ఇటీవల సుమారు వంద వరకు చెల్లించాలని అర్జీలు అందజేశారు. పీడీఎఫ్ అర్జీలలో కొన్ని స్కూల్ సర్టిఫికెట్ల తేదీలు మార్పు, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ల తేదీ మార్పు, మ్యారేజ్ సర్టిఫికెట్లు, ఆధార్ మార్పులు గుర్తించాం. పీడీఎఫ్‌ల కోసం తప్పుడు ధ్రువపత్రాలు ఇచ్చినట్లు తేలితే క్రిమినల్ కేసులు పెడతాం.

ప్ర: డ్రెడ్జింగ్ పనులతో నష్టపోయిన రైతులను ఎలా ఆదుకుంటారు?

జ: ప్రస్తుతం డ్రెడ్జింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటి మూలంగా కొంత నీరు, ఇసుక బయటకు వెళ్లాల్సి వస్తుంది. వీటి వల్ల నష్టపోయిన రైతులను గుర్తిస్తాం. పోర్టు యంత్రాంగం నష్టపరిహారం ఇప్పిస్తాం.

శాసనసభలో మన ఎమ్మెల్యేల గళం

డయాలసిస్ యూనిట్లు మంజూరు చేయాలి: రవికుమార్



ఆమదాలవలస, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉద్దానం ప్రాంత కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్న డయాలసిస్ రీసెర్చ్ సెంటర్‌పై రా ష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని శుక్రవారం అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పట్లో రూ.50 కోట్లతో దీనిని మంజూరు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ రీసెర్చ్ సెంటర్‌లో అనుకున్న స్థాయిలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందడం లేదన్నారు. ఆమదాలవలస ప్రధాన ఆస్పత్రితో పాటు పొందూరు ఆస్పత్రికి డయాలసిస్ యూనిట్లు మంజూరు చేయాలని వైద్యశాఖ మంత్రిని కోరారు.

పట్టణాభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి: శంకర్



శ్రీకాకుళం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం పట్టణ అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. అసెంబ్లీ సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. కళింగపట్నం వద్ద వంశధార, పెద్దగనగళ్లవానిపేట వద్ద నాగావళి నదుల దిశ మారిపోయిందన్నారు. ఇదివరకు ఆహ్లాదకరంగా ఉన్న బీచ్‌ల రూపురేఖలు మారిపోవడంతో పర్యాటక పరంగా నష్టం వాటిల్లడంతోపాటు మత్స్యకారులకు ఇబ్బంది ఏర్పడి జీవనోపాధి లేకుండా పోయిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీచ్ ఫెస్టివల్స్ పెద్ద ఎత్తున నిర్వహించామన్నారు. ఇప్పుడు బీచ్ లేకుండాపోయిందని.. దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించి, బీచ్‌లను అభివృద్ధి చేయాలని కోరారు.

కిడ్నీ బాధితులను ఆదుకోండి: అశోక్



కవిటి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతంలో రోజురోజుకీ కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోందని, డయాలసిస్ కేంద్రాల్లో బెడ్స్ సంఖ్య పెంచి ఆదుకోవాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అసెంబ్లీలో ప్రస్తావించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడును, మంత్రి నారా లోకేష్‌ను కలిసి నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మత్తు వదిలిస్తున్నారు

(ఐదో పేజీ తరువాయి)

రవాణాతో పాటు వినియోగం అధికంగా ఉండేది. గత ఐదేళ్లలో పోలీసుల నిఘా కొరవడడంతో.. గంజాయి రవాణా యథేచ్ఛగా సాగింది. వైసీపీ పాలనలో గత మూడేళ్లలో గంజాయి రవాణాకు కేరాఫ్ అడ్రస్‌గా సిక్కోలు మారింది. కానీ 2022-24 జూలై మధ్య పోలీసులు కేవలం 43 కేసులు మాత్రమే నమోదు చేయడం చర్చనీయాంశమైంది. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల ముందు జాతీయ రహదారిపై పెద్ద కంటైనర్ బోల్తా పడగా.. అందులో 100 కేజీల గంజాయి పట్టుబడింది. ఇది మినహా గత ఐదేళ్లలో ఎక్కడా గంజాయి పెద్ద ఎత్తున పట్టుకున్న దాఖలాలు లేవు. దీంతో జిల్లాలో గంజాయి రవాణా యథేచ్ఛగా సాగగా.. యువత, కార్మికులతోపాటు విద్యార్థులు సైతం ఆ మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

రిహాబిటేషన్, డి-అడిక్షన్ కేంద్రాలకు తరలింపు..

జిల్లాలో ఎంతోమంది యువకులు గంజాయి మత్తుకు బానిసయ్యారు. ఆ మత్తులో కుటుంబ సభ్యులపై సైతం దాడులకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిలో మార్పు తీసుకొచ్చేందుకు ఎస్పీ మహేశ్వరరెడ్డి సరికొత్త కార్యక్రమం చేపట్టారు. జిల్లాలో ఎన్నడూ లేనివిధంగా 17మంది మత్తు బాబులను.. వారి తల్లిదండ్రుల అనుమతితో విశాఖలోని రిహాబిటేషన్ కేంద్రానికి తరలించారు. అలాగే మరో నలుగురిని శ్రీకాకుళం రిమ్స్‌లో ఉన్న డి - అడిక్షన్ కేంద్రంలో చేర్పించి మత్తు వదిలించే పని చేపట్టారు.

గంజాయి రహితమే ధ్యేయం..

గంజాయి రహిత సమాజమే ధ్యేయంగా పని చేస్తున్నాం. గంజాయి నివారణలో ప్రజలు భాగస్వామ్యం కావాలి. గంజాయి మత్తుకు బానిసలైన వారి తీరును మార్చేందుకు కృషి చేస్తున్నాం. జిల్లాలో ఆరు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. ప్రత్యేక శిక్షణ కలిగిన జాగిలాలతో గంజాయి జాడ కోసం గాలిస్తున్నాం. డ్రోన్ల సహాయంతో గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. 2025 నాటికి జిల్లాలో గంజాయి మూలాలు లేకుండా చేస్తాం.

-ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



కందివలస గెడ్డను ఆక్రమించి రోడ్డు వేసిన దృశ్యం

ఉపాధి లేదు.. కాలుష్యమే!

(ఐదో పేజీ తరువాయి)

సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) జిల్లాలో పారిశ్రామికవాడలను ఏర్పాటు చేసింది. 1985లో పైడిభీమవరంలో 450 ఎకరాల్లో భారీ పారిశ్రామిక వాడను ప్రారంభించింది. ఇందులో 275 ఎకరాలను రసాయనిక జోన్‌కు కేటాయించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 13 రసాయన పరిశ్రమలు కొనసాగుతున్నాయి. ఎచ్చెర్ల మండలం కుశాలపురంలో 16 ఎకరాలు, పలాసలో 31 ఎకరాలు, ఆమదాలవలసలో 19ఎకరాలతో పారిశ్రామికవాడలను ఏర్పాటు చేసింది. ఇందులో పైడిభీమవరమే అన్నింటికంటే పెద్దది. ఈ ప్రాంతంలో అనేక పరిశ్రమలున్నా.. స్థానికులకు ఇక్కడ ఆశించినస్థాయిలో ఉపాధి దొరక్కపోగా.. ఈప్రాంతాన్ని కాలుష్యంతో కబలిస్తోంది. పైడిభీమవరం, నారువ, సరగడపేట, చిల్లపేట, గొల్లపేట, బోయపాలెం పూర్తిగా కాలుష్యబారిన పడ్డాయి. పరిశ్రమలు విడిచిపెట్టే కాలుష్యంతో ప్రజలు కిడ్నీ, మూత్రపిండాలు, తదితర రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికే కొంతమంది మృత్యువాత పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి కల్పించడంతో పాటు కాలుష్య నియంత్రణపై దృష్టి పెట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రికెట్ కోచ్‌గా దమయంతి

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ విభాగంలో ఇచ్ఛాపురం సబ్ సెంటర్‌కు ఉమెన్ కోచ్ దమయంతిని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) నియమించినట్టు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైసీ శాస్త్రి, కార్యదర్శి హసన్ రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏసీఏ కోచ్‌గా దమయంతి పనిచేశారు.

మహాగర్జన విజయవంతం చేయాలి

కవిటి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భాగంగా ఈ నెల 29న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మాలల మహాగర్జన ర్యాలీని విజయవంతం చేయాలని ఆ సంఘ ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్రవారం డి.గొనగపుట్టుగలో అంబేడ్కర్‌వాడల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు పందిరి లోకేష్, పందిరి కేశవరావు, బోనెల కర్నారావు, రాము, దుర్యోధన, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అరసవల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, వలంటీర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు డి.నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు వలంటీర్లకు ఇస్తామన్న రూ.10వేల వేతన హామీని నెరవేర్చాలని, జాబ్ చార్ట్ ప్రకటించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఆరోగ్యకరమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలి

శ్రీకాకుళం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యకరమైన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని డీఎల్‌పీవో ఐవీ రమణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాగోలు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఇంటింటికి చెత్త సేకరణ, వర్మీ తయారు, చెత్త సేకరించి వేరు చేసే విధానాన్ని ఆయన పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెంగళరావు, కార్యదర్శి తిరుమలదేవి, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

'బోనెల' ఎంపికపై హర్షం

లావేరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): దళిత నేత బోనెల అప్పారావుకు రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక కావడంపై జిల్లా మాలమహానాడు ఉపాధ్యక్షుడు, ఎచ్చెర్ల టీడీపీ ఎస్సీ విభాగం నాయకులు నిడిగంట్ల సూర్యరావు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఆమదాలవలస మండలం కొర్లకోటకు చెందిన బోనెల అప్పారావు సుదీర్ఘ కాలంగా జిల్లా దళిత నాయకులుగా ఉంటూ ఎస్సీ వర్గానికి చెందిన అనేక మందికి సేవలు అందించడంతో టీడీపీ ప్రభుత్వం గుర్తించడం శుభపరిణామమన్నారు. ఈ పదవి ఇప్పించిన ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆయుష్ సేవలపై అవగాహన

పొందూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వైద్యసేవల కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యసేవలందించడంలో ఆశ వర్కర్లది కీలకపాత్రని కింతలి హోమియో వైద్యాధికారి పి.పద్మజ అన్నారు. తాడివలస పీహెచ్‌సీలో శుక్రవారం ఆశ వర్కర్లకు ఆయుష్ వైద్యసేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు రమేష్‌నాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కంచిలి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని కంచిలి మండల యూటీఎఫ్ శాఖ ప్రతినిధులు కోరారు. మందస మండలం హరిపురంలో ఈ నెల 24, 25 రెండు రోజుల పాటు జరిగే మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఎంఈవోలు శివరామ్‌ప్రసాద్, చిట్టిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. మండల ప్రధాన కార్యదర్శి నల్లాన రవి, త్రినాథ్, అధ్యక్షుడు త్రిలోచన ప్రధాన్, పురుషోత్తంరెడ్డి, హేమసుందర్, భగవతీరావు, త్రినాథ్‌సాహు, తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు వర్క్‌షాప్

శ్రీకాకుళం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నైర వ్యవసాయ కళాశాలలో అగ్రి క్లినిక్స్, బిజినెస్ సెంటర్స్ ఏసీఏబీసీ స్కీమ్‌పై శుక్రవారం నాబార్డు జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డు డీడీఎం రమేష్ కృష్ణ మాట్లాడుతూ.. అగ్రి గ్రాడ్యుయేట్లు ఈ పథకం ద్వారా రూ.20లక్షలతో వ్యాపారం ప్రారంభించి, రూ.8.8లక్షల వరకు సబ్సిడీ పొందవచ్చన్నారు. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి అగ్రి ప్రెన్యూర్‌షిప్ ఆవశ్యకత, అవసరమైన నైపుణ్యాలను వివరించారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ చెన్నమ నాయుడు, అసోసియేట్ డీన్ ఎం.భరత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడదాం

ఆమదాలవలస, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాతోపాటు ఆమదాలవలస నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు ఐక్యతతో పోరాటం చేద్దామని నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు.



నేటి నుంచి షణ్ముఖ శర్మ ప్రవచనాలు

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 73 ఏళ్లుగా నిరంతరం ఆర్ష, సాహిత్య, ఆధ్యాత్మిక ప్రచారం చేస్తున్న ఉపనిషన్మందిరం 73వ వార్షికోత్సవాల్లో భాగంగా శ్రీ సుమిత్ర కళా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖశర్మ 'శ్రీసూర్య దర్శనమ్' ప్రవచన యజ్ఞం నిర్వహిస్తున్నట్టు సంస్థల ప్రతినిధులు గుమ్మా నగేష్, ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. నగరంలోని బాపూజీ కళామందిరంలో శనివారం నుంచి బుధవారం వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవచన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఉపనిషన్మందిరం 1950లో సత్సంగంగా ఏర్పాటై ఆ తర్వాత ఆర్ష, సాహిత్య, ఆధ్యాత్మిక ప్రచార సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. నాటి నుంచి నేటి వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఆర్ష సాహిత్య, ఆధ్యాత్మిక వెలుగులను నింపేందుకు కృషి చేస్తోందన్నారు. గతంలో ప్రముఖ ప్రవచనకారులు చాగంటి కోటేశ్వరరావు, గరికిపాటి నర్సింహారావు, బాచుపల్లి సంతోష్‌కుమార్, ఓరుగంటి రాజరాజేశ్వర శర్మ, వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి, మల్లాప్రగడ శ్రీమన్నారాయణ వంటి ఎందరో ప్రముఖులు ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో ప్రసంగాలిచ్చారన్నారు. షణ్ముఖశర్మ చేపడుతున్న ఆధ్యాత్మిక ప్రసంగంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

తీరని 'అపార్' కష్టాలు!

- ఇబ్బందిపడుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని విద్యార్థులకు అపార్ కార్డు కష్టాలు తీరడం లేదు. ఆధార్‌లో తప్పులు, డేటాఫ్ బర్త్, పేర్లు, అడ్రస్ మార్పు వంటి సమస్యలు అపార్ కార్డు నమోదుకు అడ్డంకిగా మారింది. దీంతో వీటిని సరిచేసుకునేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడరానిపాట్లు పడుతున్నారు. గత కొద్ది రోజులుగా నగరపాలక సంస్థ కార్యాలయం, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తరగతులకు డుమ్మా కొట్టి గంటల కొద్దీ క్యూలో ఉండి అవస్థలు పడుతున్నారు. సచివాలయంలో ఒక్కో సమస్యపై రూ.100 చొప్పున వసూలు చేస్తుండగా.. నగర పాలక సంస్థ కార్యాలయంలో మూడు మార్పులకు రూ.100 వసూలు చేస్తుండడంతో ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉంది. దీంతో నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎనిమిది కౌంటర్ల ద్వారా సేవలందిస్తున్నారు. దీనిపై కమిషనర్ పీవీవీ ప్రసాదరావు మాట్లాడుతూ.. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సచివాలయాల ఎడ్యుకేషన్ సెక్రటరీలు, ఎంఈవోలతో మాట్లాడి అపార్ నమోదు వేగవంతం చేయాలని ఆదేశించినట్టు తెలిపారు.



నగరనపాలక సంస్థ కార్యాలయంలో గత రెండు రోజులుగా ఇదే పరిస్థితి

నేడు సత్యసాయి బాబా జయంతి

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతి శనివారం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 17 నుంచి గ్రామ సేవ దినోత్సవం, మహిళా దినోత్సవం, యువజన దినోత్సవం, ఆధ్యాత్మిక మహోత్సవం, బాల వికాస్ దినోత్సవం, సేవాదళ్ దినోత్సవం నిర్వహించారు. కుంకుమ పూజలు, అభిషేకాలు, నగర సంకీర్తనలు నిర్వహించడమే కాకుండా పేదలకు, అనాథలకు ఆహారం, విద్య తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సాయి భక్తులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. నగరంలోని పెద్ద మందిరం, న్యూ కాలనీ సత్యసాయి మందిరం, కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న గణేష్ మందిరం, బలగ హడ్కో కాలనీ ఉన్న సాయి మందిరం, విశాఖ-ఏ కాలనీలోని సత్యసాయి మందిరంలో సత్యసాయి జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నారు. న్యూ కాలనీ మందిరంలో 99 కేకులు ప్రదర్శన ఉంటుంది. అదేవిధంగా మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

- ఎచ్చెర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కొయ్యావానిపేట గ్రామంలో శుక్రవారం 100 మందికి దుప్పట్లు, చీరలను సత్యసాయి భక్తులు పంపిణీ చేశారు. సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నర్సింహమూర్తి, సమితి ప్రతినిధులు ఎల్.చంద్రశేఖర్, ఎన్.రమణమూర్తి, కె.గణపతి రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ వెలుగుల్లో న్యూ కాలనీ వద్ద సత్యసాయి మందిరం

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

ఆమదాలవలస, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఎదుట రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 26న జరగనున్న రాజ్యాంగ హక్కుల పరిరక్షణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. న్యాయవాదులు హనుమంతు ప్రసాదరావు, సీతారాం, ప్రభాకరరావు తదితరులు ఉన్నారు.

- పొందూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న నిర్వహించనున్న రాజ్యాంగ దినోత్సవ ర్యాలీని విజయవతం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రశన్న కోరారు. రాజ్యాంగ దినోత్సవ ర్యాలీకి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. దేశపౌరులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తున్న రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. పాఠశాల హెచ్ఎం బి.కంఠయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

4.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

- డీఏవో త్రినాథస్వామి



వరి పనులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

జి.సిగడాం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాదికి 4.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్టు జిల్లా వ్యవసాయాశాఖాధికారి త్రినాథస్వామి అన్నారు. శుక్రవారం మద్దివలస తదితర గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాలో 3,60,450 ఎకరాల్లో వరి పంట సాగు జరిగిందని, 3,45,220 ఎకరాలకు సంబంధించి ఈకేవైసీ పూర్తయిందన్నారు. జిల్లాలో 620 రైతు సేవా కేంద్రాల్లో మూడు కేటగిరీలుగా విభజించి 402 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. దళారులను ఆశ్రయించకుండా రైతులు తమకు నచ్చిన మిల్లులకు ధాన్యాన్ని పంపించుకోవచ్చన్నారు. ఏవో ఎర్రా శారద, వీఏఏలు పొగిరి నారాయణరావు, ముంతా హరీష్, సింహాద్రి హరికృష్ణ, అలుగోలు లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శాంతిశ్రీ

గార, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి బి.శాంతిశ్రీ అన్నారు. శుక్రవారం ఉదయం ఆమె రాళ్లపేటలో కాలనీ లేఔట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి తొందరగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. అనంతరం దీపావళి గ్రామంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ పరిశీలించి సాయంత్రానికి పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఎంపీడీవో ఎస్.రామమోహనరావు, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య సేవలు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

అరసవల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విలీనం అనంతరం నిలిపివేసిన రిఫరల్ ఆసుపత్రుల ద్వారా అందించే వైద్య సేవలు పునరుద్ధరించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ప్రభుత్వాన్ని కోరారు. రిటైర్డు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులకు నైట్ అలవెన్సు చెల్లించాలని, ఖాళీగా ఉన్న సుమారు 10వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఈయూ జోనల్ కార్యదర్శి బి.కృష్ణమూర్తి, ఈయూ జిల్లా అధ్యక్షుడు గూనాపు త్రినాథ్, ఎస్ఎస్ఆర్ శర్మ, శ్రీకాకుళం-1,2 డిపోల నాయకులు ఎస్‌వీ రమణ, కె.రామకృష్ణ, కె.గోవిందరావు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అరసవల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడిని పౌర సరఫరాల సంస్థలో పనిచేస్తున్న పొరుగు సేవల సిబ్బంది కోరారు. ఈ మేరకు గురువారం రాత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ ప్రతినిధులు నర్సింగరావు, సీహెచ్ రాజేశ్వరి, గంటల సురేష్, కుమార్ రాజా, బెవర అమర కుమార్, శోభ, యూనియన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

- ఐటీడీఏ పీవో



హాట్ బజార్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీవో

సరుబుజ్జిలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెన్నెలవలస గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను సీతంపేట ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం పాఠశాల లోని తరగతి గదులను పరిశీలించారు. కార్యక్ర మంలో ఐటీడీఏ ఏఈ నాగభూషణ్, పాఠశాల హెచ్ఎం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ● హాట్ బజార్ల నిర్మాణం వల్ల గిరిజనులకు ఎంతో మేలు కలుగుతుందని పీవో తెలిపారు. వెన్నెలవలస గిరిజన ప్రాంతంలో నిర్మాణం జరుగుతున్న హాట్‌బజార్‌ను ఆయన పరిశీలించారు. ఐటీడీఏ పరిధిలో 12 హాట్ బజార్లు మంజూరైనట్టు తెలిపారు.

ఆరోగ్య రక్షతో పోలీసులకు సురక్ష



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది ఆరోగ్య సంక్షేమం దృష్ట్యా జిల్లాలో హోంగార్డు నుంచి పోలీసు అధికారి వరకు అందరికి ఉచిత ఆరోగ్య కార్డులు జారీ చేయనున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. కిమ్స్ గ్రూప్స్ ఆఫ్ హాస్పటల్ అధినేత బొల్లినేని భాస్కరరావు పోలీసు ఉద్యోగులకు రూ.100 చెల్లిస్తే ఉచిత ఆరోగ్య కార్డుల ద్వారా అన్ని రకాల వైద్య సేవలు పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు సర్వీసు కాలంలో అందిస్తామని చెప్పడంతో, పోలీసు వెల్ఫేర్ నుంచి ఆ మొత్తాన్ని చెల్లిస్తామని ఎస్పీ తెలిపారు. రాగోలు జెమ్స్ హాస్పటల్‌లో శుక్రవారం కిమ్స్ గ్రూప్స్ ఆఫ్ హాస్పటల్స్ సౌజన్యంతో జెమ్స్, కిమ్స్ వైద్యుల సహకారంతో పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్పీ, కిమ్స్ గ్రూప్స్ ఆఫ్ హాస్పటల్ సీఎండీ బొల్లినేని భాస్కరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, బి.రాజశేఖర్, అప్పారావు, శేషాద్రి, సీఐలు ఇమ్మాన్యుయల్ రాజు, ఎం.అవతారం, కె.పైడపు నాయుడు, ఎస్ఐలు, పోలీసు, జెమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ ప్రారంభోత్సవానికి చంద్రబాబుకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను చంద్రబాబుకు అందిస్తున్న దృశ్యం

రణస్థలం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బంటుపల్లి పంచాయతీ పరిధి జాతీయ రహదారికి ఆనుకొని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీశ్రీ రాధా గోకులానంద ఆశ్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబును ఆశ్రమ నిర్వాహకులు ప్రభు మహారాజ్ ఆహ్వానించారు. శుక్రవారం అమరావతిలో ఆహ్వాన పత్రాన్ని అందించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ఐదు రోజులపాటు ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈయనతో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.


ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలో వ్యాపారులు తమ దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్ కుమార్ హెచ్చరించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ప్లాస్టిక్ షాపులు, వర్తక వ్యాపార దుకాణాల్లో శుక్రవారం హెల్త్ అఫీసర్ ఆకస్మిక తనిఖీలు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న వ్యాపారులకు అపరాధ రుసుం విధించారు.

రిజర్వేషన్ కౌంటర్ సమయం పెంచాలి

కంచిలి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కంచిలి రైల్వే స్టేషన్లో రిజర్వేషన్ సౌకర్యాన్ని ఒక్క పూటకే పరిమితం చేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని స్టేషన్ కన్సల్టింగ్ కమిటీ సభ్యులు పూనా రవికుమార్, టిల్లు శర్మ, తిరుపతిరావు, నాగేంద్ర, పురుషోత్తం యాదవ్ అన్నారు. రిజర్వేషన్ సౌకర్యాన్ని గతంలో లాగే రెండు పూటలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ.. శుక్రవారం స్థానిక సీఎంఐ అజయ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కుర్థా డివిజన్ ఉన్నతాధికారులతో పాటు కేంద్రమంత్రి రామ్మోహన్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు వినతి పత్రాలు అందించారు.

రైజ్ సంస్థల అధినేతకు భారత్ విభూషణ్ పురస్కారం



పురస్కారంతో ప్రవీణ్

శ్రీకాకుళం/ ఇచ్ఛాపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కవిటి మండలం బైరిపురం గ్రామానికి చెందిన ఎన్నికల వ్యూహకర్త, రైజ్ సంస్థల అధినేత డాక్టర్ ప్రవీణ్ పుల్లటకు ప్రతిష్టాత్మక భారత్ విభూషణ్ పురస్కారం దక్కింది. రాజకీయ పరిశోధన, సామాజిక బాధ్యత విభాగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న వారికి ఇండియన్ సోషల్ రిపార్మ్స్, హైయర్ ఎడ్యుకేషన్ సంస్థ ఈ అవార్డు అందిస్తుంది. ఈ మేరకు ఢిల్లీ సీఎం సమావేశం మందిరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్‌నివాస్ గోయెల్ చేతుల మీదుగా ఈ అవార్డును ప్రవీణ్ అందుకున్నారు.

సౌత్‌జోన్ వర్సిటీ పోటీల శిక్షకుడిగా అప్పన్న

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో వెయిట్ లిఫ్టింగ్ శిక్షకుడిగా పని చేస్తున్న ఇప్పిలి అప్పన్నను నియమించినట్టు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నుంచి డీఎస్ఏకు ఉత్తర్వులు అందాయి. ఈ పోటీలు ఈ నెల 25 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతాయి. ఈ మేరకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

మణిపాత్రునికి అభినందన

ఎచ్చెర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ముద్దాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మణిపాత్రుని నాగేశ్వరరావును యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా సత్కరించారు. శ్రీకాకుళంలోని జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, జిల్లా కార్యదర్శి గొంటి సురేష్, సంఘ నేతలు జి.విశ్వనాథం, అజయ్ తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా మణిపాత్రుని సేవలను కొనియాడారు.

మహారుద్రాభిషేకం

అరసవిల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలోని బొంపాడ వీధిలో గల రామ మందిరం వద్ద 108 లింగాలకు మహాలింగార్చన నిర్వహించారు. అర్చకులు నేతేటి రాజేశ్వర శర్మ, హరిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అధిక సంఖ్యలో దంపతులు, భక్తులు పూజలు చేశారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి


రామారావు (ఫైల్)

పాతపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చిందిరి రామారావు (73) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొరసవాడ పంచాయతీ శివరాంపురం గ్రామానికి చెందిన రామారావు మెళియాపుట్టిలోని నేస్తం ఇంటికి వెళతానని చెప్పి గురువారం బయలుదేరాడు. ఆలాంద్రరోడ్‌లోని దాసుపురం కూడలి సమీపంలో చేరువలో రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి ఉన్నాడు. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా అతడిని స్థానిక సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం కేజీ హెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వాహనంతో ఢీకొన్న వ్యక్తి శివరాంపురం వాసిగా గుర్తించారు. మృతుడికి భార్య గౌరమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు.

అధికార లాంఛనాలతో ఆర్మీ జవాన్ అంత్యక్రియలు


గాలిలో కాల్పులు జరిపి నివాళులర్పిస్తున్న పోలీసులు

సోంపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తురకశాసనాం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ వెదుళ్ల నాగేశ్వరరావు(57) గుండెపోటుతో రెండు రోజుల కిందట మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుకు గురైనట్టు తెలిపారు. మృత దేహాన్ని స్వగ్రామానికి తరలించి అధికార లాంఛనాలతో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. నాగేశ్వరరావుకి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

టీడీపీ నేత గట్టెం రాములు మృతి


రాములు (ఫైల్)

ఎచ్చెర్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, అరిణాం అక్కివలస మాజీ సర్పంచ్ గట్టెం రాములు (75) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రమశిక్షణ గల నేతగా గుర్తింపు పొందిన రాములు.. సర్పంచ్‌గా, పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా, కన్వీనర్‌గా, నీటి సంఘం అధ్యక్షుడిగా, వాటర్ షెడ్ ఛైర్మన్‌గా సేవలందించారు. మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతికి ముఖ్య అనుచరుడిగా రాజకీయాలు నెరిపిన రాములు మండల స్థాయి రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. రాజకీయాల్లోకి రాకముందు కొన్నాళ్ల పాటు మురపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామోపాధ్యాయుడిగా పనిచేశారు. ఈయనకు భార్య జయలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమారులు శివరామ్, హరిబాబు టీడీపీ రాజకీయాల్లో చురుగ్గా పనిచేస్తున్నారు.

రెండు ఆటోలు ఢీ.. ఇద్దరికి గాయాలు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గార మండలం అచ్చెన్నపాలెం గ్రామానికి చెందిన దుడ్డు మోహన్ శుక్రవారం మధ్యాహ్నం 80 అడుగుల రోడ్డులో ఉన్న ఎక్సైజ్ కార్యాలయం నుంచి రాంగ్ రూట్‌లో వస్తూ కలెక్టరేట్ వైపు వెళ్లే అవతలి రోడ్డులోకి మలుపు తిప్పుతుండగా.. మిల్లు జంక్షన్ నుంచి 80 అడుగుల రోడ్డు వైపు వస్తూ అడ్డుగా వచ్చిన ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు ఆటోలు బోల్తా పడగా, రాంగ్ రూట్‌లో ఆటో నడుపుతూ వస్తున్న మోహన్ గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కి తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని సోంపేట మండల వాసి మృతి


మృతిచెందిన అందాల యోగేశ్వరరావు

కశింకోట (అనకాపల్లి జిల్లా), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందాడు. సీఐ అల్లు స్వామి నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలానికి చెందిన అందాల యోగేశ్వరరావు (52) సుమారు ఏడాది క్రితం కుటుంబ సభ్యులతో విభేదించి ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. అప్పటి నుంచి అనకాపల్లి, కశింకోట ప్రాంతాల్లో కూలి పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కశింకోటలో అమ్మవారి పండుగ చూసేందుకు వచ్చాడు. అనంతరం స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద జాతీయ రహదారి దాటుతుండగా ఎలమంచిలి వైపు నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కశింకోట వీఆర్‌వో ఎం.చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని సీఐ చెప్పారు.

వంశధార నిర్వాసితులకు న్యాయం చేయాలి

- రెవెన్యూ మంత్రిని కోరిన జడ్పీటీసీ

హిరమండలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వంశధార నిర్వాసితులకు న్యాయంచేయాలని జడ్పీ టీసీ పొగిరి బుచ్చిబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాన సత్య ప్రసాద్‌ను అమరావతిలో కలిసి వినతిపత్రం అందించారు. కొమరాడ గ్రామానికి చెందిన నిర్వాసితులకు ఇంటి నిర్మాణానికి 5 సెంట్లు భూమి ఇవ్వాల్సి ఉండగా రెండు సెంట్లు ఇచ్చారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వంశధార ప్రాజెక్టులో భూ సేకరణ చేయగా మిగిలిన భూమిని సాగు నీటి సౌకర్యాలు కల్పించి ఉపాధి కల్పించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని జడ్పీటీసీ తెలిపారు.

చదువులో ఉన్నత శిఖరాలకు ఎదగాలి


సైకిల్ స్టాండ్‌ను ప్రారంభిస్తున్న బలగ ప్రకాష్

టెక్కలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణిస్తూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలని బలగ ఫౌండేషన్ ఛైర్మన్ బలగ ప్రకాష్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.3 లక్షలతో ఏర్పాటుచేసిన సైకిల్ స్టాండ్‌ను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొనాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ మాట్లాడుతూ కోరిన వెంటనే విద్యార్థుల కోసం సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మోదుగువలస దుర్యోధనరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రైల్వే గేట్లు మూసివేత

టెక్కలి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రైల్వే ట్రాక్ పనులు చేపడుతున్న నేపథ్యంలో శనివారం రైల్వే గేట్లు మూసివేస్తున్నట్లు రైల్వేశాఖ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ వై.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు టెక్కలి-తొలుసూరుపల్లి, తలగాం, ఇజ్జువరం గ్రామాల్లోని రైల్వే గేట్లు మూసి వేయనున్నామన్నారు. ఆయా మార్గాల్లో ప్రయాణించే వారు ఇతర మార్గాల్లో రాకపోకలు సాగించాలన్నారు.

గోతులు పూడ్చడంలో నిర్లక్ష్యం

- స్థానికులే ఎర్ర జెండాలు పాతినా..
  స్పందించని అధికారులు

టెక్కలి/వజ్రపుకొత్తూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిత్రాలను చూస్తున్నారుగా రోడ్ల గోతుల మయం కాగా వాటిని పూడ్చడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాటి నివారణకు గాను స్థానికులే గోతుల్లో కర్రను పాతి హెచ్చరికలు చేస్తున్నారు. ఇలా రోజుల తరబడి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా టెక్కలి మండల పరిధి లోని ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల ను కలుపుతూ ప్రధానమార్గం నౌపడా- మెళియాపుట్టి రోడ్డు అనేక చోట్ల గోతులు గా తయారైంది. గూడెం సమీపంలో గోతుల్లో వాహనాలు పల్టీకొడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అనేకమంది గాయాలబారిన పడుతున్నారు. దీంతో స్థానికులు వీటిని గుర్తించి ఆ గోతిలో ఎర్రజెండాను పాతి ప్రమాద హెచ్చరికగా ఏర్పాటు చేశారంటే ఆర్‌అండ్‌బీ యంత్రాంగం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమవుతోంది. అలాగే వజ్రపు కొత్తూరు మండలం ఒంద్రుకుడియా సమీపంలోనూ ఇదే పరిస్థితి. నిత్యం ఒడిశా రాష్ట్రం పర్లాకిడిమి, పాతపట్నం, చాపర, మెళి యాపుట్టి నుంచి భారీ వాహనాలు, ఇతర వాహనాలు ప్రయాణ సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు స్థానికులు తెలి పారు. ఇప్పటికైనా ఆర్‌అండ్ బీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.


టెక్కలి: ఎన్ఎం రోడ్డులో గూడెం సమీపంలో ఇలా..


వజ్రపుకొత్తూరు: ఒంద్రుకుడియా రోడ్డు మధ్యలో..

కోతకు గురైన రోడ్డు


కోతకు గురైన రోడ్డు

హరిపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మందస మండలం రట్టి గ్రామం నుంచి బీచ్‌కు వెళ్లే మార్గం దారుణంగా ఉంది. వరద నీటి ప్రవాహంతో రోడ్డు మొత్తం కోతకు గురై కనీసం నడిచేందుకు వీలు లేకుండా పోయింది. ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేదు. గతంలో గ్రామస్థులు, యువకులు శ్రమదానం చేసినా ఆ తరువాత మరలా దారుణంగా తయారైంది. బీచ్‌కు పిక్నిక్ సందర్శకులు రాకపోకలు ఎక్కువగా ఉండడంతో ఇబ్బందిగా మారింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

సీఎం గ్రీవెన్స్‌పై నిర్లక్ష్యం వహిస్తే ఎలా?

- కంచిలి తహసీల్దార్, వీఆర్వోకు నోటీసులు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కాశీబుగ్గ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను తేలికగా తీసుకోవద్దని, సీఎం గ్రీవెన్స్ ఫిర్యాదులే పట్టించుకోకుంటే ఎలా అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాశీబుగ్గ టీకేఆర్ కల్యాణ మండపంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంచిలి మండలానికి చెందిన మల్లారెడ్డి మోహన్‌రావు సీఎం గ్రీవెన్స్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై తహసీల్దార్, వీఆర్వో పొంతనలేని సమాధానాలు చెప్పడంతో వారిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం గ్రీవెన్స్‌పైనే నిర్లక్ష్యం వహించిన కంచిలి తహసీల్దార్ రమేష్, చిన్న కొజ్జిరియా వీఆర్వో హర్షవర్ధన్‌కు నోటీసులు జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు. తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ లాగిన్‌కు వచ్చిన ఫిర్యాదులపై తహసీల్ధార్ లాగిన్ ఎవరికి ఇచ్చిన వారు పూర్తి స్థాయిలో సమాధానం పెట్టాలన్నారు. లాగిన్‌లో కంప్యూటర్ ఆపరేటర్లు తప్పుడు సమాచారం పెడితే తహసీల్దార్లు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కొన్ని మండలాల్లో తహసీల్లార్ల లాగిన్‌కు వచ్చిన ఫిర్యాదులను కనీసం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రీవెన్స్ రిజల్ట్ చాలా పూర్‌గా ఉందన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. నీటి పన్ను వసూలు చాలా మండలాల్లో ఇంతవరకు ప్రారంభించలేదని, మూడు వారాల్లో నీటి పన్నువసూలు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో వెంకటేశ్వరరావు, ఆర్డీవో జి.వెంకటేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేసుకోవాలి

టెక్కలి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ సభ్యులు డిసెంబరు 5లోగా ఈకేవైసీ చేసుకోవాలని టెక్కలి పీఏసీఎస్ సీఈవో పోలాకి శ్రీమన్నారాయణదాసు కోరారు. ప్రస్తుతం పీఏసీఎస్‌లకు సంబంధించి కంప్యూటరీకరణ జరుగుతున్న నేపథ్యంలో టెక్కలి పీఏసీఎస్‌లో సభ్యత్వం కలిగిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకున్న వారికే పథకాలుపొందే అవకాశం ఉందన్నారు. ఈకేవైసీకి రైతులు 1బీ, ఆధార్, రేషన్, పాన్‌కార్డులు, డీసీసీబీ బ్యాంకుఖాతా, నామినీ ఆధార్ తదితర ధ్రువపత్రాల జిరాక్స్‌లను కార్యాలయంలో అందించాలని కోరారు.

చిన్నకొల్లివలస పాఠశాలకు గుర్తింపు

ఎల్.ఎన్.పేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చిన్నకొల్లివలస ఆర్‌అండ్‌ఆర్‌కాలనీ ఎంపీపీ పాఠ శాలకు ప్రభుత్వ పాఠశాలగా గుర్తింపు వచ్చినట్లు ఎంఈవోలు సీహెచ్ మణికుమార్, కె.చంద్ర మౌళి తెలిపారు. వంశధార ఫేజ్-2 ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చిన్న కొల్లివలస గ్రామ స్థులు ఎల్.ఎన్ పేట మండలంలోని మోదుగవలస జంక్షన్‌లో స్థిరపడినప్పటికీ హిరమండలం మండలంలోని డైస్‌కోడ్‌తో ఇంతవరకు కొనసాగింది. హిరమండలం నుంచి ఎల్ఎన్‌పేట మండలానికి డైస్‌కోడ్‌ను మార్చేందుకు అనేక పర్యాయాలు మండల అధికారులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా ఎట్టకేలకు డైస్‌కోడ్ మార్పు వచ్చిందన్నారు. దీంతో ఇకపై ప్రభుత్వ పాఠశాలగా గుర్తింపు వచ్చిందని వారు పేర్కొన్నారు.

పేదల పక్షాన పోరాడిన ధీరుడు 'పినకాన'

టెక్కలి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన ధీరుడు పినకాన కృష్ణమూర్తి అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బవిరి కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం నౌపడా-మెళియాపుట్టి రోడ్డు జంక్షన్‌లో పినకాన స్థూపం వద్ద 8వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. రైతుల కోసం పోరాడి నిర్బంధాలను సైతం ఎదురొడ్డారని కొనియాడారు. కార్యక్రమాల్లో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు, సీపీఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య, హనుమంతు ఈశ్వరరావు, పి.సాంబమూర్తి, బగాది వాసుదేవరావు, పినకాన అజయ్ కుమార్, రాంపురం సర్పంచ్ పినకాన జోగారావు, స్టాలిన్ బాబు, పినకాన రాణి తదితరులు పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్ వేగవంతం చేయాలి

కొత్తూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జియో ట్యాగింగ్‌ను వేగవంతం చేయాలని ఎంపీడీవో నీరజ పేర్కొన్నారు. లబ్బ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది తప్పనిసరిగా ప్రతిఇంటికి వెళ్లి సర్వే చేయాలని తెలిపారు.

సర్వే ప్రక్రియ పరిశీలన

జలుమూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న హౌస్ హోల్డింగ్ సర్వేని వేగవంతం చేయాలని ఎంపీడీవో కె.అప్పలనాయుడు అన్నారు. జలుమూరులో శుక్రవారం సర్వేని పరిశీలించారు. శుక్రవారం 1908 ఇళ్లలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు.

మండలంలో ముమ్మరంగా..

నరసన్నపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో హౌస్ హోల్డ్ సర్వే ముమ్మరంగా సాగుతోంది. ప్రతీ ఇంటికి ఒక యూనిక్ నెంబరు ఇచ్చేందుకు ఈ సర్వే చేపడుతున్నారు. మండలంలో 30 పంచాయతీల్లోని 43 గ్రామాల్లో ఈ సర్వే చేపడుతున్నారు. ఈనెల 25 నాటికి పూర్తి చేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో మధుసూదనరావు తెలిపారు.

26న సమస్యలపై శంఖారావం


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నేతలు

కాశీబుగ్గ, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా విధానాలను నిరసిస్తూ ఈనెల 26న ఆర్డీవో కార్యాలయం ఎదుట శంఖారావం నిర్వహిస్తున్నట్లు పలువురునేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం వివిధ సంఘా ల నేతలు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ రద్దు చేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం గిట్టుబాటు ధర కల్పిస్తూ చట్టం చేయాలన్నారు. వీటి సాధనకు గాను 26న జరుగు శంఖారావంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు బాలాజీరావు, భాస్కరరావు, ధర్మారావు, దిలీప్, కేశవరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ వద్ద ఆందోళన

మెళియాపుట్టి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ఆందోళననువిజయవంతం చేయాలని సీపీఎం నాయకులు ప్రసాదరావు, సూరయ్య తెలిపారు. శుక్ర వారం చాపర కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. కార్పొరేట్‌కు అనుకూలంగా ఎన్డీఏ పాలన సాగుతోందని విమర్శించారు.

డిసెంబరు 8న చలో విశాఖ

కాశీబుగ్గ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణ చేయాలని తీర్పు నివ్వడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని రైల్వే ఎంప్లాయిస్ ఎస్సీ ఎస్టీ యూనియన్, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ బి.నారాయణరావు అన్నారు. శుక్రవారం కాశీబుగ్గలో డిసెంబరు 8న నిర్వహించనున్న చలో విశాఖ కరప త్రాలను విడుదల చేశారు. ఎస్సీ ఎస్టీలకు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ కల్పించాలని, పెరి గిన జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో నేతలు నాగభూష ణరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

జానపద కళలను పరిరక్షించాలి


బద్రి కూర్మారావును సత్కరిస్తున్న విజయనగరం కళాశాల అధ్యాపకులు

పలాసరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జానపద కళలను పరిరక్షించాలని గిడుగు రామ మూర్తి జానపద కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు అన్నారు. విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'జానపద కళలు-పాటలు' అనే అంశంపై ప్రసంగించారు. జానపద కళలు మరుగునపడుతున్న తరుణంలో వాటి ఉనికిని తెలిపేందుకు ప్రతీ ఏటా జానపద కళలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటి ఆవశ్యకతను తెలియజేస్తున్నామన్నారు. అనంతరం ఆయనను కళాశాల అధ్యాపకులు సన్మానించారు.

జనవరి 12న జానపద కళా జాతర

పలాసరూరల్,నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతిఏటా సంక్రాంతికి నిర్వహించే సిక్కోలు కళాజాతర వచ్చే ఏడాది జనవరి 12న వజ్రపుకొత్తూరు మండలం రాజాంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహక ప్రతి నిధులు తెలిపారు. జాతర విరాళాల సేకరణలో భాగంగా శుక్రవారం బొడ్డపాడుకు చెందిన కళాకా రుడు కిక్కర డిల్లీరావు రూ.5555 విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా కళాజాతర అధ్యక్షుడు రాపాక ధనరాజు మాట్లాడుతూ.. వచ్చే ఏడాది అన్ని రకాల కళలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి పేద కళాకారులకు ఆర్థిక సాయం అందించనున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి మామిడి కృష్ణారావు, ప్రచార కార్యదర్శి కుత్తుమ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదెకరాల చెరుకు తోట దగ్ధం

నరసన్నపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మాకివలస-కిల్లాం గ్రామాల మధ్య కిల్లాం గ్రామ రైతులకు చెందిన చెరుకు పంట అగ్నికి ఆహుతైంది. శుక్రవారం సాయంత్రం చెరుకు తోటలో విద్యుత్ వైర్లు షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో బోడి రామారావుకు చెందిన ఐదెకరాలు, యాళ్ల ప్రసాదరావుకు చెందిన రెండు ఎకరాలు, బొడి రామన్నకు చెందిన మూడెకరాల చెరుకు పంట దగ్ధమైంది. కరాలు చెరుకు పంట అగ్నికి దహనం అయింది. మరో పది రోజుల్లో చెరుకు కటింగ్ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్న సమయంలో ఇలా అగ్నిప్రమాదం జరగడంతో వారు రోదిస్తున్నారు. నరసన్నపేట అగ్నిమాపకశాఖ అధికారులు ప్రమాద సంఘటన వద్దకు చేరుకుని మంటలను అదుపులోకి చర్యలు చేపట్టారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కాశీబుగ్గ, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కాశీబుగ్గ సీఐ డి.మోహన్‌రావు అన్నారు. శుక్రవారం అంబుసోలి గ్రామంలో స్థానికులతో సంకల్ప్‌లో భాగంగా అవగాహన కలిగించారు. మత్తు పదార్థాలకు బానిస లైతే వాటి వల్ల కుటుంబాలు నాశనం అవుతారమన్నారు.

సైబర్ నేరాల నివారణకు సహకరించండి

సంతబొమ్మాళి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని టెక్కలి రూరల్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. సైబర్ నేరాలకు ఎవరూ గురికావద్దన్నారు. ఎస్ఐ వై.సింహాచలం,ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల కోసం పాటుపడాలి

వజ్రపుకొత్తూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధన కోసం పాటుపడాలని ఎస్ఐ బి.నిహార్ అన్నా రు. శుక్రవారం హుకుంపేట హైస్కూల్లో వివిధ అంశాలపై అవగా హన కలిగించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కష్టపడే వారికే అవకాశాలు లభిస్తాయన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిటైర్డ్ రైల్వే ఉద్యోగులకు ఎస్‌బీఐలో ప్రత్యేక కౌంటర్

పలాస, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన రైల్వే ఉద్యోగులకు స్థానిక ఎస్‌బీఐలో ప్రత్యేక కౌంటర్ ద్వారా పెన్షన్ పొందవచ్చని రైల్వే రిటైర్డ్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు డి.భవనేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జీవీరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎస్‌బీఐ మేనేజర్‌ను కలిసి రిటైర్డ్ ఉద్యోగుల ఇబ్బందులను వివరించారు. బ్యాంకులు బిజీ సమయాల్లో పెన్షన్ తీసుకునేందుకు ఇబ్బం దులు తలెత్తుతున్నాయని, 70 ఏళ్ల పైబని వారు నిలుచునేందుకు కష్టపడాల్సి వస్తోందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు దీనికి చీఫ్ మేనేజర్ స్పందిస్తూ.. ప్రతి నెలా 2వ తేదీన ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుకు అంగీకరించారు. చీఫ్‌మేనే జర్‌ను కలిసిన వారిలో సీఎం సింగ్, బి.రమణ, కె.మల్లేశ్వరరావు, డి.జనార్ధన, జి.రామచంద్రరావు, డి.అన్నాజీరావు, డి.రాము తదితరులున్నారు.

పనుల గుర్తింపునకు గ్రామసభ

నరసన్నపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో వేతనదారులతో చేయించే పనులను గ్రామసభల ద్వారా గుర్తి స్తున్నట్లు డ్వామా ఏపీడీ యుగంధర్ అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. చెరువులో పూడిక తీతతో పాటు చెరువులను అభివృద్ధి చేసేందుకు తీర్మానించారు. సత్యవరం, నరసన్నపేటలో 9 చెరువులను గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకరరావు, ఉప సర్పంచ్ కృష్ణబాబు, పి.కృష్ణప్రసాద్ మాజీ సర్పంచ్ చిట్టిబాబు, టీపీ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఎస్ఐగా ఎండీ అమీర్ ఆలీ



కొత్తూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐగా ఎండీ అమీర్‌అలీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకు ముందు దోనుబాయి, పాతపట్నం, నందిగాంలలో ఎస్ఐగా విధులు నిర్వహించారు. ఇంత వరకు ఎస్ఐగా పనిచేసిన ఎం.ఎ అహ్మద్ ఇంటిలిజెన్స్ విభాగానికి బదిలీ అయిన సంగతి తెలిసిందే.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

మందస,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి జయంతి సందర్భంగా స్థానిక బృందావన్‌లో శుక్రవారం 135 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో సేవా సంస్థ కన్వీ నర్ వి.ఈశ్వర రావు, ప్రతినిధులు ఎం.ధనుంజయ రావు, సాంబమూర్తి, కె.లోకనాథం, భరత్ మహరణ, ఇప్పిలి చిట్టి తదతరులు పాల్గొన్నారు.

నేడు సత్యసాయి జయంతి

హరిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మందస మండలం హరిపురం, కొండలోగాం పంచాయతీ జన్నివీధిలో సత్యసాయి బాబా జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పూజలు, ప్రత్యేక భజనలు, అన్నసంతర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

పోలాకిలో..

పోలాకి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పోలాకి, వెదుళ్లవలస, డోల, పిన్నింటిపేట దండులక్ష్మీపురం గ్రామాల్లో శనివారం సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పేదలకు దుస్తుల పంపిణీ, అన్నప్రసాద వితరణ, ప్రత్యేక పూజలు, భజనలు చేపడుతున్నామని, సత్యసాయిభక్తులు పాల్గొనాలని కమిటీ ప్రతినిధులు రామారావు, గణేష్, మహేష్ రుంకునాయుడు తెలిపారు.

409 మందికి వైద్య పరీక్షలు

హరిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీఎస్‌పురం హైస్కూల్ ఆవరణలో శుక్రవారం గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. జెమ్స్ వైద్యులు శివమణి, కుసుమ, వినయ్ 409 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, సుగర్, గుండె, లివర్, నరాలు, గైనిక్ సంబంధిత వ్యాధులకు పరీక్షలుచేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొర్ల కన్నారావు, మార్పు వెంకటేశం, సురేష్, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

23 దరఖాస్తుల తిరస్కరణ

నందిగాం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటరుగా దరఖాస్తు చేసుకున్న 66 మందికి గాను 23 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు. సర్వీస్ సర్టిఫికేట్ పొందుపరచనందున తిరస్కరించి నట్లు, రెండో విడతలో నమోదు చేసుకుంటే విధిగా ఆరేళ్ల సర్వీస్ సర్టిఫికేట్ పొందుపరచాలని సూచించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

జలుమూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిఏటా స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నట్లు జుత్తు జగన్నాయకులు చారిటబుల్ ట్రస్టు యలమంచిలి ప్రతినిధి జుత్తు సింహాచలం అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం టెన్త్ స్టడీ మెటీరియల్ 144 సెట్లను ఎంఈవో బి.మాధవరావుకు అందించారు. మండలంలోని 16 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వీటిని అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు పట్ట వైకుంఠరావు, రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయండి

మెళియాపుట్టి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖలో గ్యాంగ్ రేప్‌నకు గురైన విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలని మహిళా సంఘం జిల్లా కన్వీనర్ కె.నాగమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం చాపరలో ఆందోళన చేపట్టారు. మహిళలపై దాడులు రోజు రోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సంఘ నేత బళ్ల మహలక్ష్మి, సీపీఎం నాయకులు ప్రసాదరావు, సూరయ్య, శంకర్, మన్మథరావు, మీనా పాల్గొన్నారు.